సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన
ద్వారకాతిరుమల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం ప్రారంభించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకుంటున్నాయి. 10లో



ఇంటినుంచి వృద్ధురాలి గెంటివేత
ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు నెట్టేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. 10లో



నాణ్యమైన మేతతో అధిక దిగుబడి
పాడి పశువులకు నాణ్యమైన మేతతో పశువుల్లో పాల దిగుబడి పెరగడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. 10లో

న్యూస్‌రీల్

మద్ది హుండీ ఆదాయం రూ.26.83 లక్షలు



మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 54 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ: 26,83,741 వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం శ్రీగోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరరావు స్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో ఆలయ మానికల రాంబాబు పర్యవేక్షణలో సిబ్బంది, అర్చకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పాల్గొన్నారు.

భీమవరంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాధర్నా



భీమవరంలో ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం : ఎల్‌ఐసీ ఏజెంట్ల మనుగడ దెబ్బతీసేలా ఎల్‌ఐసీ మేనేజ్‌మెంట్, ఐఆర్‌డీఏ తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ సోమవారం భీమవరం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఆలిండియా లియాఫీ యూనియన్ పిలుపు మేరకు గత 16 రోజులుగా భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహిస్తుండగా దీనికి కొనసాగింపుగా మహాధర్నా నిర్వహించినట్లు యూనియన్ భీమవరం బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సత్యనారాయణ, పీవీ శ్రీనివాసరావు చెప్పారు.

11న ఆశా వర్కర్ల ధర్నా



భీమవరంలో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

భీమవరం : ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 11 కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం భీమవరం సీఐటీయు కార్యాలయంలో చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఇంతవరకు ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. 11న కలెక్టరేట్ ఆఫీస్ ముందు ప్రదర్శన ధర్నా నిర్వహించాలని ఆమె పిలుపు ఇచ్చారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు కె.రాయి, లారెన్స్ కుమారి, బేగం, ఆదిలక్ష్మి, జయంతి, ప్రశాంతి, సాయిలక్ష్మి, శ్యామల, అరటికట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసిన డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, గూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా డీఆర్‌ఓగా మొగిలి వెంకటేశ్వర్లు, తాడేపల్లిగూడెం ఆర్డీవోగా ఖతీబ్ కౌసర్ బానో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. డీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన మొగిలి వెంకటేశ్వర్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డీఆర్‌ఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు.

కూటమి నేతల దీపావళీ వసూళ్లు!

షాపుల వద్ద దందా
- షాపు స్థాయిని బట్టి రూ.20 వేల నుంచి రూ.70 వేల వరకు మామూళ్లు
- అదనంగా బాణసంచా సమర్పించుకోవాల్సిందే
- బెంబేలెత్తిపోతున్న వ్యాపారులు



సాక్షి, భీమవరం: కాసుల వేటే లక్ష్యంగా సాగుతున్న కూటమి నేతలు ఇప్పుడు దీపావళి బాణసంచా దుకాణాల నుంచి వసూళ్ల దందాకు తెరదీశారు. ఒక్కో బాణసంచా దుకాణం నుంచి రూ.20 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా బాణసంచా దుకాణాల నుంచి రూ.2 కోట్ల మేర వసూలు చేస్తున్నట్టు అంచనా. దీపావళికి మూడు రోజుల ముందు నుంచి బాణసంచా విక్రయాల కోసం ఏటా తాత్కాలిక లైసెన్సులు జారీ చేయడం పరిపాటి. షాపుల కోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే వాటికి లైసెన్సులు జారీ చేస్తారు.

చక్రం తిప్పుతున్న కూటమి నేతలు

జిల్లాలో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో బాణసంచా లైసెన్సుల నిమిత్తం వ్యాపారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా దాదాపు అన్నిచోట్లా కూటమి పార్టీల నేతలే చక్రం తిప్పుతున్నారు. అధికారులకు చెప్పి బాణసంచా షాపులకు లైసెన్సులు మంజూరు చేయించడంతోపాటు బాణసంచా అమ్మకాలు జరిగే ప్రదేశాల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా రక్షణ ఏర్పాట్లు సరిగా లేకున్నా అధికారులు చూసీ చూడనట్టుగా ఉండేందుకు వారికి మామూళ్లు, మూడు రోజులకు షాపులకు విద్యుత్ సదుపాయం, ఇతర నిర్వహణ నిమిత్తం అయ్యే ఖర్చులను కూటమి నేతలే నిర్ణయించి తాము చెప్పినంత ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు.

జిల్లా అంతటా ఇదే తంతు

జిల్లా కేంద్రం భీమవరంలో సోమవారం నాటికి 31 షాపుల వరకు ఏర్పాటుకాగా.. ఒక్కో షాపు నుంచి పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులకు మామూళ్ల పేరిట రూ.25 వేల వరకు, షాపులు ఏర్పాటు చేస్తున్న గ్రౌండ్ అద్దె, మెయింటనెన్స్ పేరిట అదనంగా మరో రూ.8,800 వరకు వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. హోల్‌సేల్ దుకాణాల నుంచి రెట్టింపు మొత్తం వసూలు చేస్తున్నట్టు తెలిసింది. అమ్మకానికి తెచ్చిన స్టాకును బట్టి సేల్స్‌టాక్స్ అధికారులను వ్యాపారులే చక్కబెట్టుకోవాలి. జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లోనూ తదితర పట్టణాల్లోనూ ఇదే తరహాలో వసూళ్లు జరుపుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. జిల్లాలో 600 వరకు షాపులు ఏర్పాటు కానుండగా రూ.2 కోట్ల వరకు కలెక్షన్స్ జరుగుతాయని అంచనా.

కొనుగోలుదారులపైనే భారం

అధికారుల మామూళ్లు, మెయింటెనెన్స్ భారంతో పాటు షాపు ఏర్పాటు కోసం బల్లలు, టెంట్లు, షెల్ఫ్‌లకు మూడు రోజుల అద్దె, పనిచేసే సిబ్బందికి వేతనాల రూపంలో షాపులను బట్టి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుందని వ్యాపారులు అంటున్నారు. ఈ భారమంతా బాణసంచా కొనుగోలుదారులపైనే వేయడం వల్ల ధరలు మరింతగా పెరిగిపోతాయంటున్నారు. మరోపక్క సిబ్బందికి పంచాలంటూ బాణసంచా సైతం కూటమి నేతలు ఇవ్వాలని అడుగుతున్నారని చెబుతున్నారు. గతంలో లైసెన్సుల జారీకి ఆయా కార్యాలయాల వద్ద సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పేవారమని, ముందెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మామూళ్లు పెంచేశారని వాపోతున్నారు. అమ్మకాలు సరిగా జరగకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత వారం ప్రజలు సమర్పించిన వినతులపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులు పరిష్కరించాలని, మళ్లీ మళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 174 వినతులు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన దివ్యాంగుడి కల

కలెక్టర్ చొరవతో దివ్యాంగుడి కల నెరవేరింది. తాడేపల్లిగూడెంకు చెందిన కోటిపల్లి సాయిబాబు ఈ నెల 7న 'మీకోసం' కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. తాను దివ్యాంగుడినని, మూడు చక్రాల బైక్ ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌ను కోరాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ లయన్స్ క్లబ్ సౌజన్యంతో రూ.1.20 లక్షల విలువైన హోండా యాక్టివా మూడు చక్రాల వాహనాన్ని సమకూర్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తన చేతుల మీదుగా సాయిబాబాకు వాహనాన్ని అందజేశారు.



కోటిపల్లి సాయిబాబుకు మోటార్ సైకిల్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఇసుకను చేరువ చేసేందుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, చిత్రంలో జేసీ, జిల్లా ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సామాన్యుడికి ఇసుకను చేరువ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా ఇసుకపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అందుబాటులో లేనందున పొరుగు జిల్లాల నుంచి జిల్లాకు తీసుకువచ్చి స్టాక్ చేసేందుకు అనువైన స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించాలన్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా గృహ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులను జారీ చేసిందని, తీసుకెళ్లేందుకు ముందుగా సంబంధిత సచివాలయంలో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఒక యాప్ రానుందని, వచ్చిన వెంటనే కార్యకలాపాలను ప్రారంభించాలని సూచించారు.

దేదీప్యమానం

- నరికొత్త ఆకృతుల్లో ప్రమిదలు
- రూ.50 నుంచి రూ.450 వరకు ధరలు





సాక్షి, భీమవరం: దీపావళి అంటేనే దీపాల పండుగ. చీకటిని పారదోలి వెలుగులు నింపే ఈ పండుగను ప్రతి ఇంటా వేడుకగా జరుపుకుంటారు. ఇళ్లంతా ప్రమిదల్లో నూనె పోసి దీపాలతో అలంకరించడం అనాదిగా వస్తున్న ఆచారం. పూర్వం మట్టి ప్రమిదలను వినియోగించేవారు. రానురానూ ప్రమిదలు సరికొత్త హంగులను అద్దుకుంటున్నాయి. ఈ ఏడాది రాష్ట్రంలోని పలుచోట్ల నుంచే కాకుండా రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతున్నారు.

విభిన్న ఆకృతులు

లక్ష్మీ గణపతి ఆకృతి, లక్ష్మీదేవి, కలశం, శంఖు చక్రం, గజ వాహనం, కొబ్బరికాయ, పాతకాలం నాటి కిరోసిన్‌బుడ్డి దీపం, తులసికోట తదితర విభిన్న ఆకృతుల్లో ఈ ప్రమిదలు కనువిందు చేస్తున్నాయి. ప్రమిదల డిజైన్‌ను బట్టి రూ.50ల నుంచి రూ.450లు వరకు ధరల్లో ఆకట్టుకుంటున్నాయి. వీటి కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యమిస్తున్నారు. మరోపక్క విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీపావళికి మరో రెండు రోజులు మాత్రమే గడువుండగా భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం పట్టణాలతో పాటు పల్లెల్లోను ప్రమిదల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి.

మట్టి ప్రమిదలకు ఆదరణ



దీపావళి సందర్భంగా వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు తయారుచేసి మార్కెట్‌కు తరలించాం. పండుగకు వారం రోజుల ముందు నుంచి చాలామంది కొనుగోలు చేస్తున్నారు. దీపావళి సందర్భంగా ప్రమిదలకు ఎప్పుడు ఆదరణ ఉంటుంది.
– పొన్నపల్లి భాస్కరరావు, మొగల్తూరు











రక్తదానంతో పునర్జన్మ



భీమవరంలో రక్తదానం చేసిన పోలీసులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో భీమవరం ఎల్‌హెచ్ టౌన్‌హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. సమాజ శ్రేయస్సు, రక్షణకు, శాంతియుత వాతావరణానికి ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరంలో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు ఎస్పీ ప్రశంసా పత్రాలు, జ్యూస్, బిస్కెట్లు అందజేశారు.

బాస్కెట్‌బాల్ విజేతగా కృష్ణా

పెనుమంట్ర: మార్టేరులో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. బాలికల ఫైనల్ పోటీల్లో 42–8 స్కోర్ తో కృష్ణా జిల్లా జట్టు అనంతపురంపై గెలుపొందింది. తూర్పుగోదావరి బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగం ఫైనల్లో కృష్ణా జిల్లా జట్టు పశ్చిమగోదావరిపై విజయం సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా అదనపు ఎస్పీ ఎస్‌ఎంబీ మురళీకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు.



అండర్–17 బాస్కెట్‌బాల్ విజేతగా నిలిచిన కృష్ణా జిల్లా బాలికల జట్టు

31 నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్

భీమవరం (ప్రకాశంచౌక్): తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా అర్హులైన లబ్ధిదారులకు ఉచిత సిలెండర్ అక్టోబర్ 31 నుంచి అమలు కానున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 6,21,626 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని, ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు కలిగి ఆధార్‌తో అనుసంధానమైన అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. సంవత్సరానికి మూడు సిలెండర్ల చొప్పున ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్హత మేరకు సిలెండర్లను ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణించి ప్రతి నాలుగు నెలలకు ఒక సిలెండర్ చొప్పున అందజేస్తామన్నారు. సిలిండర్ మొత్తం నగదును ముందుగా చెల్లిస్తే తదుపరి 48 గంటల్లో లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారన్నారు.

గద్దెనెక్కిన ఐదు నెలల్లోనే విద్యుత్ భారం

కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



వీరవాసరం: విద్యుత్ చార్జీల పెంపుతో సీఎం చంద్రబాబు మళ్లీ మడతేశారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సోమవారం తీవ్రంగా దుయ్యబట్టారు. అధికారంలో ఉంటే ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉంటే మరో విధంగా మారే చంద్రబాబునాయుడుని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గద్దెనెక్కిన ఐదు నెలల్లోనే రూ.672.86 కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారులపై అదనపు చార్జీల భారం వేయడమే చంద్రబాబు విజన్ అంటూ ఎద్దేవా చేశారు. 2015–16 లో 76 యూనిట్లకు విద్యుత్ బిల్లు రూ.140 రూపాయలు వచ్చేదని 2018– 19 నాటికి బిల్లు 197.60గా ఉందన్నారు. సుమారు 41.04 శాతం పెరిగిందన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్న విద్యుత్ చార్జీల విషయంలో, విద్యుత్ రంగం విషయంలో ఇలాంటి కుట్రలే చేస్తుంటారని చెప్పారు.

నరసాపురం డీఎస్పీగా శ్రీవేద



నరసాపురం: నరసాపురం డీఎస్పీగా శ్రీ వేదను బదిలీ చేశారు. ఇంతవరకూ పనిచేస్తున్న మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మురళీకృష్ణ ఎన్నికలైన గత ఆగస్టు 28న నియమితులయ్యారు. వెంటనే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. డీఎస్పీగా శ్రీవేదకు ఇదే తొలి పోస్టింగ్.

క్లుప్తంగా

హోమాల పేరుతో మోసం.. సిద్ధాంతిపై కేసు

మొగల్తూరు: హోమాలు చేస్తానని నమ్మించి మోసగించిన ఓ సిద్ధాంతిపై మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి వాసు కథనం ప్రకారం పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన పెచ్చెట్టి గోపాలకృష్ణకు కుక్కల శ్రీను అనే వ్యక్తి ద్వారా మొగల్తూరుకు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వెంకటాచార్యులు పరిచయమయ్యాడు. తమ సమస్యలను సిద్ధాంతికి చెప్పుకోగా మూడు రోజులపాటు హోమాలు చేస్తే పరిష్కారమవుతాయని నమ్మించాడు. దీంతో గోపాలకృష్ణ మొగల్తూరులోని సిద్ధాంతి ఇంటికి వచ్చి మూడు రోజులున్నా ఎటువంటి హోమాలు చేయలేదు. పైగా నీవు మీ ఇంటికి వెళ్లేలోపు అందరూ చనిపోతారని భయపెట్టి 54 రోజులు పాటు అతడిని ఇంటిలో నిర్బంధించాడు. అంతేకాకుండా దఫదఫాలుగా గోపాలకృష్ణ నుంచి రూ.37.50 లక్షలు వెంకటాచార్యులు వసూలు చేశాడు. ఈ మొత్తానికి సంబంధించి సిద్ధాంతి ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14 మంది ఎస్పీని కలిసి సమస్యలను స్వయంగా వివరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీ ఆర్‌బీ సీఐ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలెక్షన్స్

వీరవాసరం: ఈనెల 30వ తేదీన స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024 -25 విద్యా సంవత్సరానికిగాను ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14, 17 బాలుర క్రికెట్ జట్ల ఎంపికలు తణుకు (తేతలి) స్టెప్పింగ్ స్టోన్ స్కూల్ నందు, అండర్ 17 బాలికల జట్ల ఎంపికలు దేవరపల్లి అంబటి సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరుగుతాయన్నారు. వివరాలకు 80741 53923లో సంప్రదించాలని కోరారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

- ద్వారకాతిరుమల గురుకులంలో జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న 5 జిల్లాలకు చెందిన 108 మంది విద్యార్థులు
- ఆకట్టుకుంటున్న ప్రాజెక్టులు



సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్

ద్వారకాతిరుమల: ప్రతిభకు సృజనాత్మకతను జోడించి టెక్నాలజీతో పలు ప్రాజెక్టులను తయారు చేశారు కొందరు గురుకులం విద్యార్థులు. వాటిని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం ప్రారంభించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ముందుగా రెండు రోజులపాటు నిర్వహించనున్న జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి, ఉప సర్పంచ్ బొండాడ సావిత్రి, ఎంఈఓ-2 పరసా వెంకట్రావులతో కలసి ఘనంగా ప్రారంభించారు. తూర్పు, పశ్చిమ, కృష్ణ, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 31 గురుకులాల్లోని 108 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నారు. అలాగే 52 మంది సీనియర్, జూనియర్ ఉపాధ్యాయులు, 63 మంది టెక్నికల్ స్టాఫ్ ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. అందులో ముఖ్యంగా భవిష్యత్తులో భూమి ఎలా ఉండబోతోంది, ప్లాస్టిక్ కవర్ల వల్ల కలిగే హానీ.. కాగితం కవర్ల వినియోగం వల్ల చేకూరే ప్రయోజనాలు, అలాగే స్మార్ట్ ఈవీఎం.. సాధారణ బ్యాలెట్ బాక్సుల మధ్య వ్యత్యాసాలు, వాటి ఉపయోగాలను తెలిపే ప్రాజెక్టులను ప్రదర్శించారు. మంగళవారం జరిగే పలు కార్యక్రమాలతో ఈ విజ్ఞాన ప్రదర్శనలు ముగియనున్నాయి.

మహిళల రక్షణకు సహకారి



ప్రస్తుత సమాజంలో ఏదో ఒక ప్రాంతంలో నిత్యం మహిళలు, యువతులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. వాటిని నిరోధించేందుకు, మహిళలకు రక్షణ కల్పించేలా ఉమెన్ సేఫ్టీ ప్రాజెక్టును రూపొందించాం. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళల రక్షణ చట్టాలు, ధరించాల్సిన దుస్తులు ఇలా అన్ని అంశాలను ఈ ప్రాజెక్టు తెలియజేస్తుంది.

– గుణశ్రీ, గంజి లక్ష్మీనరసింహ గౌతమి, పొలసానిపల్లి గురుకులం విద్యార్థినులు

ఆటోమెటిక్ డస్ట్‌బిన్‌తో మేలు



ఆటోమెటిక్ డస్ట్‌బిన్‌ను హాస్పిటల్స్, హాస్టల్స్, షాపింగ్ మాల్స్, స్కూల్స్ ఇలా అన్ని ప్రదేశాల్లో వినియోగించుకోవచ్చు. ఇందులో వేసిన చెత్త నుంచి బ్యాక్టీరియా, చెడు వాసన బయటకు రాదు. దివ్యాంగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీని తయారీకి అయ్యే ఖర్చు కేవలం రూ.70 నుంచి రూ.100 మాత్రమే. డస్ట్‌బిన్ మూత ఆటోమెటిక్‌గా తెరచుకోవడానికి నేను పవర్ బ్యాంక్‌ను వినియోగించాను. దాని స్థానంలో చిన్న బ్యాటరీలను వాడవచ్చు.

– ఎండీ అష్రఫ్, కృష్ణాజిల్లా, పామర్రు గురుకులం విద్యార్థి

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు



ప్లాస్టిక్ వాడకం ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. మనం వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు మట్టిలో కలవవు. వాటిని తిన్న పశువులు అనారోగ్యాల పాలై, మృత్యువాత పడుతున్నాయి. అందుకే పేపర్లతో తయారు చేసే కవర్లనే ప్రజలు వినియోగించాలి. వాటిని ఎలా తయారు చేసుకోవాలి, ఎలా వినియోగించాలి అనే విషయాలను తెలిపేలా ఈ ప్రాజెక్టును రూపొందించాం.

– నౌడు సౌమ్య, మోర్త వైష్ణవి, పిఠాపురం గురుకులం విద్యార్థినులు

స్మార్ట్ ఈవీఎంలు బెటర్



ఎన్నికల్లో స్మార్ట్ ఈవీఎంలను ఉపయోగించడమే మేలు. అందుకే ఈ స్మార్ట్ ఈవీఎంను తయారు చేశాం. ఈవీఎంల వాడకం ద్వారా ఖర్చు, సమయం రెండూ ఆదా అవుతాయి. అలాగే ఓటరు స్పష్టంగా తమ ఓటు హక్కును వినియోగించగలుగుతారు. అదే బ్యాలెట్ అయితే ఖర్చు, సమయం వృథా అవుతాయి. సింబల్స్‌పై సరిగ్గా పడని ఓట్లు చెల్లుబాటు కావు. ఇలా బ్యాలెట్ వినియోగం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి.

– ఘంటా సుష్మ, పొన్నూరి చాందిని, వట్లూరు గురుకులం విద్యార్థినులు

నాణ్యమైన మేతతో అధిక పాల దిగుబడి





చింతలపూడి: పాడి పశువులకు నాణ్యమైన మేత అందించడం వల్ల పశువుల్లో పాల దిగుబడి పెరగడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె లింగయ్య తెలిపారు. పాడి పశువుల్లో విటమిన్ -ఎ, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాల లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలా మంది రైతులు వర్షాకాలం, చలి కాలంలో పచ్చిమేతలు, ఎండా కాలంలో ఎండు గడ్డిని దాణాగా అందిస్తారు. ఇది సరైన పద్ధతి కాదని.. పచ్చిమేత ఎక్కువగా దొరికే వర్షాకాలంలో పాతర వేసి నిల్వ చేసుకోవాలని చెప్పారు. అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు.

ఎంత మేత పెట్టాలి

రోజూ ఒక్కో పశువుకు 8 కిలోల వరి గడ్డి, లేదా ఎండు చొప్ప, 8 కిలోల లెగ్యూమ్ జాతి పచ్చి మేత(పిల్లి పెసర, అల సంద, గోరు చిక్కుడు), 16 కిలోల గింజజాతి పచ్చి మేతలు ఇస్తే.. అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. దీనివల్ల సకాలంలో ఎదకు వస్తాయని, పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుందని తెలిపారు.

పశువుల్లో గొడ్డుమోతు సమస్యకు పరిష్కారం

సకాలంలో ఎదకు రాకపోవడం, గర్భకోశ వ్యాధులు, అండంలో లోపాల వల్ల ఈ సమస్య అధికంగా ఉంటుంది. పశువులు ఈనిన తరువాత 60 నుంచి 90 రోజుల్లో ఎదకు వచ్చి చూలు కట్టాలి. ఎదకు రాని పశువులను సకాలంలో పశు వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లి పరీక్ష చేయించాలి. ప్రతి రోజు ఎద లక్షణాలను పరిశీలించి కృత్రిమ గర్భధారణ చేయించాలి. తగిన వయసు, బరువు లేని పశువుల్ని చూడి కట్టించడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఆవులకు 18 నెలలు, గేదెలకు 24 నెలల వయసు వచ్చిన తరువాత మాత్రమే చూడి కట్టించాలి.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



డీఆర్ఓ ఉదయభాస్కరరావును సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి తగిన గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. డీఆర్ఓ జె.ఉదయభాస్కరరావు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో ఆయనకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి డీఆర్ఓ ఉదయభాస్కరరావును శాలువా, పూలమాలలతో సత్కరించి బుద్ధుని ప్రతిమను బహూకరించారు. ఎన్నికల పనులు, వరదలు, విజయవాడ వరదలకు సహాయ కార్యక్రమాల సమన్వయంలో డీఆర్ఓ ఉదయభాస్కరరావు సమర్థవంతంగా పనిచేశారని, నెల్లూరు జిల్లాలో కూడా మంచి సేవలు అందించి గుర్తింపు పొందాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. జిల్లా యంత్రాంగం తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముగ్గురు దొంగల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: ఆకివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు 66 గ్రాముల బంగారు ఆభరణాలు, చోరీకి ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆకివీడు పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండేళ్లుగా ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఆకివీడుకు చెందిన అవాల వెంకన్నబాబు, వాన లక్ష్మణరావులను ఆకివీడు ఎస్సై హనుమనాగరాజు వెంకయ్య వయ్యేరుకాలువ బ్రిడ్జి సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ జయసూర్య చెప్పారు. విచారణలో మరో 16 మంది దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. ఇందులో భీమవరం పట్టణం గునుపూడికి చెందిన డీఆర్‌యూగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ అందే కుమారశ్రీ నాగవెంకట త్రినాథ్‌ను కూడా అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన 15 మంది వివిధ కేసుల్లో నిందితులని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆకివీడు సీఐ వి జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కూలిన భవనం.. మహిళకు గాయాలు



రేలంగి చిత్ర మందిర్ ప్రాంతంలో కూలిన పాత భవనం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని రేలంగి చిత్ర మందిర్ ఏరియా సమీపంలో సోమవారం పురాతన భవనం కూలిన ఘటనలో ఒక మహిళకు గాయాలయ్యాయి. చిత్రమందిర్ ప్రాంతంలో శిథిలావస్థకు చేరుకున్న భవనంలో కొందరు చిరు వ్యాపారాలు వ్యాపారం సాగిస్తున్నారు. ఈ భవనం తొలగించాలంటూ పురపాలక శాఖ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చినా భవన యజమానులు స్పందించలేదు. సోమవారం సాయంత్రం ఈ భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో ఆప్రాంతంలోని చిరు వ్యాపారి పూర్ణకుమారి అనే మహిళకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు, కమిషనర్ ఏసుబాబు, ఫైర్ ఆఫీసర్ రామారావు సందర్శించారు.

స్విమ్మింగ్ పోటీల్లో పోలీసులకు పతకాల పంట



పతకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: గుంటూరులో ఈనెల 27వ తేదీన నిర్వహించిన 5వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా పోలీసులు పలు పతకాలు సాధించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ పి సత్యనారాయణ 400 మీటర్ల ఫ్రీ స్టయిల్‌పోటీల్లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అలాగే తాడేపల్లిగూడెం టౌన్ కానిస్టేబుల్ డి అనిల్ కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీల్లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎస్ శ్రవణ్‌కుమార్ 100 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. సోమవారం విజేతలను ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అడిషినల్ ఎస్పీ వి భీమారావు అభినందించారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: అనారోగ్య సమస్యలు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన గుబ్బల సత్యనారాయణ(73) గత కొంతకాలంగా వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దానికి తోడు సుమారు 10 రోజుల నుంచి విపరీతమైన నడుం నొప్పితో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యలు భరించలేక సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సత్యనారాయణ రెండో కుమారుడు హరీష్‌బాబు ఫిర్యాదు మేరకు ఎస్సై నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా నిలవాలి



ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న దేగ ప్రభాకర్, అగ్రిగోల్డ్ ఏజెంట్లు

కొయ్యలగూడెం: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలిచి సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు డేగ ప్రభాకర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలానికి చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్లు సోమవారం ప్రభాకర్‌ను కలుసుకుని బాధితులకు న్యాయం చేయడంలో సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి అని మహా విజ్ఞాపన దీక్ష విజయవాడలో చేపట్టిన నేపథ్యంలో తామందరూ పాల్గొన్నట్లు ఏజెంట్లు తెలిపారు. రూ.10 వేల లోపు డిపాజిట్లు కలిగిన కొందరు ఖాతాదారులకు గత ప్రభుత్వం సొమ్ములు చెల్లించిందని, అదేవిధంగా రూ.20 వేల లోపు ఉన్న వారందరికీ కూడా సొమ్ములు చెల్లించాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులు తమ ఉద్యమానికి చేయూతనందించాలని వారు కోరారు.

వంట గ్యాస్ లీకై నివాస గృహం దగ్ధం

ముసునూరు: వంట గ్యాస్ లీకై నివాస గృహం దగ్ధమైన ఘటన ముసునూరు మండలంలోని గోపవరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గోపవరంనకు చెందిన కోడె శ్రీనివాసరావు ఇంటిలో గ్యాస్ పైపు నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు అధికమై ఇంటిని చుట్టుముట్టాయి. కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి, ప్రాణాలు దక్కించుకున్నారు. నూజివీడు నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు. బంగారం, వెండి నగలు, నగదు అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్ట్

పెదవేగి: నాటు తుపాకీ కలిగిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగి మండలం రామశింగవరం గ్రామంలో ఓ వ్యక్తి తుపాకీతో తిరుగుతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై కె.రామకృష్ణ గ్రామంలోకి వెళ్లేసరికి పొలంలో కొండా రాంబాబు అనే వ్యక్తి ఎటువంటి అనుమతి లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్నాడు. అతడిని అరెస్ట్ చేసి, నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు.

ఇంటినుంచి వృద్ధురాలి గెంటివేత



వృద్ధురాలు వెంకాయమ్మను బయటకు గెంటేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు నెట్టేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలివి. నాగులగూడెం గ్రామానికి చెందిన తానెంకి వెంకాయమ్మకు ఇద్దరు కుమారులు. వీరిద్దరూ జంగారెడ్డిగూడెంలో బాట గంగానమ్మ లేఔట్ కాలనీలో వేర్వేరుగా ఉంటున్నారు. నాగులగూడెంలో ఉన్న తన ఇల్లు కూలిపోవడంతో పెద్ద కుమారుడైన నర్సింగరావు వద్ద వెంకాయమ్మ ఉండేది. అయితే కొన్ని నెలల క్రితం పెద్ద కుమారుడు ఇంటి నుంచి బయటకు వచ్చేసి పలు చోట్లు తలదాచుకుంటూ జీవనం సాగించింది. దీంతో చిన్న కుమారుడు రాజు నాగులగూడెంలో తనకున్న మరో ఇంటిలో ఉండమని చెప్పడంతో గత రెండు నెలలుగా ఆమె ఆ ఇంటిలోనే జీవిస్తోంది. అయితే వెంకాయమ్మ ఇంటి స్థలాన్ని తనకు రాసి ఇచ్చినట్లు పెద్ద కుమారుడు ప్రచారం చేస్తుండడంతో ఈవిషయంపై చిన్న కోడలు వరలక్ష్మి, మనుమడు ఆమెతో ఘర్షణకు దిగారు. ఆస్తి పెద్ద కుమారుడికి ఇచ్చినప్పుడు మా ఇంటిలో ఎందుకు ఉంటున్నావు అంటూ ఇంటి తాళాలు వేసి ఆమెను బయటకు గెంటివేశారు. కనీసం తాను జీవించే ఉన్నంత వరకైనా తనను ఇంటిలో ఉండేలా అవకాశం కల్పించాలని వెంకాయమ్మ వేడుకుంటోంది. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎన్‌వీ రమణ, తహసీల్దార్ స్లీవ జోజితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. ప్రస్తుతం ఉంటున్న ఇంటిలోనే వెంకాయమ్మ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఆర్డీవో కోర్టుకు హాజరు కావాలని కుమారులకు నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీవో రమణ తెలిపారు.

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండకు చెందిన పెచ్చెట్టి ఏసురాజు (32) మృతదేహం సోమవారం బాడవ గ్రామం వద్ద గోదావరిలో లభ్యమైందని ఎస్సై కర్రేడి గుర్రయ్య తెలిపారు. ఈనెల 26వ తేదీన చించినాడ వద్ద వశిష్ట గోదావరి నది వంతెనపై ఏసురాజు ఫోన్, చెప్పులు ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆ ఫోన్‌తో అతని తండ్రికి కాల్ చేశారు. తండ్రి వచ్చి ఫోన్, చెప్పులు తన కుమారుడివేనని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఏసురాజు మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులకు ఏసురాజు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

ఉరివేసుకుని యువకుడి మృతి



కొప్పుల నరేష్ (ఫైల్)

కుక్కునూరు: ఉరివేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో జరిగింది. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలివి. ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కొప్పుల నరేష్ (33) తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయం అత్త, మామలకు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్టు చెప్పారు. తమ కుమారుడి మృతిపై కోడలు నవ్య, మరికొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ నరేష్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

తణుకు: తణుకులో కత్తితో బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 24వ తేదీ రాత్రి తణుకు వైపు వెళుతున్న రెండు లారీలను ఇరగవరం కాలనీ వద్ద ముగ్గురు వ్యక్తులు ఆపి డ్రైవర్లను డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరిండంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సమయంలో ఒక లారీ డ్రైవర్‌ను కొట్టి గాయపరిచి అతని జేబులో రూ.వెయ్యి లాక్కొని పారిపోయారు. గాయాలపాలైన బాధితుడు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారించగా తణుకు పాతవూరు ఇరగవరం కాలనీకు చెందిన కొల్లాటి రత్నకుమార్, సరాకుల సురేష్, తుంపాల కన్నబాబు అలియాస్ రాజు నిందితులుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి శనివారం తణుకు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

విత్తన మొక్కజొన్న రైతులతో ఒప్పందాలు చేసుకోవాలి

నూజివీడు: విత్తన మొక్కజొన్నను సాగుచేసే రైతులతో సీడ్ కంపెనీలు తప్పనిసరిగా లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా స్పష్టం చేశారు. సోమవారం నూజివీడులో పలు కంపెనీలకు సంబంధించిన ఆర్గనైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు కూడా తమ పంటను ఈ పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. విత్తన మొక్కజొన్న పంటకు సంబంధించిన దిగుబడిలో తేడాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు పంట నేలపై ఉన్నప్పుడే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, కోత అనంతరం ఫిర్యాదు చేసినట్లయితే ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ప్రైవేటు కంపెనీల ఆర్గనైజర్లు నిబంధనలను అతిక్రమించి రైతులకు విత్తనాలు ఇచ్చినయెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం ఏరులు!

- బార్లా తెరుచుకున్న బెల్టు షాపులు
- సంతలో సరుకుగా మారిన మద్యం
- అందుబాటులోకి వచ్చిన రూ.99 లిక్కర్

తణుకు: కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో మద్యం ఏరులై పారుతోంది. గత అయిదేళ్లుగా మూత పడిన బెల్టు షాపులు మళ్లీ బార్లా తెరుచుకున్నాయి. అంతే కాకుండా సంతలో సైతం నిత్యావసర సరుకు మాదిరిగా విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతోంది. తాజాగా తణుకు పట్టణంలో ఆదివారం సంతమార్కెట్‌లో మద్యం విక్రయిస్తున్న తీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే మద్యం దుకాణాలు పూర్తిగా ఏర్పాటు కాకుండా వాటి అనుబంధ విక్రయ కేంద్రాలు మాత్రం ప్రతి చోటా వెలుస్తున్నాయి. మరోవైపు లిక్కర్ ధరలు మందుబాబులకు షాక్ కొడుతున్నాయి. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 32 మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించి వైన్ షాపులు కేటాయించారు. అయితే ఇప్పటికీ పూర్తి స్థాయిలో దుకాణాలు ఏర్పాటు కాలేదు. కొత్తగా ఏర్పాటైన వైన్ షాపుల్లో సైతం పాత మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. వాటి ధరలు కూడా గతంలో కంటే రూ.20 నుంచి 60 అధికంగా విక్రయిస్తుండడం గమనార్హం.

బార్లా బెల్టుషాపులు

2014–19 మధ్య మద్యం విక్రయాలు ఇష్టానుసారంగా జరిగేవి. ఒక్కో వైన్ షాప్ ఆధీనంలో 4 నుంచి 8 వరకు బెల్టుషాపులు నిర్వహించేవారు. ఒక్కొక్కరు ఎన్ని మద్యం బాటిళ్లయినా కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో రహదారుల్లో మందుబాబుల వీరంగాలు దర్శనమిచ్చేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించింది. మద్యం కొనుగోలు విషయంలో కూడా 3 బాటిళ్లకు పరిమితి విధించింది. దీంతో గత అయిదేళ్లు బెల్టు షాపుల జాడే కనిపించకుండా పోయింది. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ బెల్టుషాపులు తెరుచుకున్నాయి. ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటైన తొలి రోజు నుంచే బెల్టుషాపులు ఏర్పాటు ప్రారంభమైంది. వైన్ షాప్ నిర్వాహకులే నేరుగా వారి అనుచరులు, బంధువులతో ఇళ్లు, పాన్ షాపులు, టిఫిన్ సెంటర్లలో సైతం మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోను మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంత మంది తెలిసిన వారికి ముందస్తు చెల్లింపులు లేకుండానే మద్యం బాటిళ్లు సరఫరా చేసి... విక్రయాలు జరిగిన అనంతరం డబ్బులు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. తణుకు పట్టణంలోనే కాకుండా తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహణకు పోటీ పడుతున్నారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించిన షాపుల్లో ప్రస్తుతం బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. దువ్వ దానేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద నాలుగు బెల్టు షాపులు నిర్వహిస్తున్నా రంటే పరిస్థితి అర్థమవుతోంది. ఇదిలా ఉంటే తణుకు మండలంలోని తేతలి, దువ్వ, కోనాల గ్రామాల్లో బెల్టు షాపులు ఎక్కువగా ఏర్పాటయ్యాయి.



తణుకు సంత మార్కెట్‌లో జోరుగా మద్యం విక్రయాలు (ఫైల్)

అందుబాటులోకి రూ.99 మద్యం

ఎట్టకేలకు రూ.99 మద్యం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఈ చీప్ లిక్కర్ షాపులకు చేరింది. అయితే సరిపడ స్టాక్ రాకపోవడంతో ఒక్కో వైన్ షాపునకు కేవలం 8కేసులు మాత్రమే సరఫరా చేయాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు. స్టాక్ వచ్చిన తర్వాత డిమాండ్ ఆధారంగా రూ.99 చీప్ లిక్కర్ క్వార్టర్లను సరఫరా చేయాలని అధికారులు భావిస్తున్నా రు. అయితే 8 కేసులు ఒక్క రోజులోనే అయిపోతాయని వైన్ షాప్ నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని దాదాపు అన్ని షాపుల్లో లూజు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ మద్యం విక్రయిస్తున్నారు. ఇందుకు బాటిల్‌పై అదనంగా రూ. 20 నుంచి రూ. 50 వరకు వసూ లు చేస్తున్నట్లు మందుబాబులు చెబుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో మద్యం ఏరులై పారుతోంది.



రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

అత్తిలి: ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు మండలంలో పంట కోల్పోయిన కౌలు రైతులు, సొంత సాగుదారులకు తక్షణమే పంట నష్టం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటనష్ట పరిహార, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని, పంటల బీమా వర్తింప జేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ వంశీకి వినతి పత్రం అందజేసారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ అత్తిలి మండలంలో ప్రధానంగా బల్లిపాడు, వరిఘేడు, కొమ్మర, ఈడూరు, తిరుపతిపురం, స్కిన్నెరపురం, కంచుమర్రు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల 14 వందల ఎకరాలలో పంటదెబ్బతిని 14 వందల మంది రైతులు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఆకుల సత్యనారాయణ, విత్తంశెట్టి సత్యనారాయణ, మంగిన ధర్మారావు, నూకల శ్రీనివాసు, పుప్పాల కొండ తదితరులు పాల్గొన్నారు.

30న కడియద్దలో సివిల్ రైట్స్ డే

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామ ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద ఈ నెల 30న సాయంత్రం 4 గంటలకు సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశానికి మండల కమిటీ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

తణుకు అర్బన్ : ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసి ప్రైవేటు బీమా కంపెనీలకు లాభం చేకూర్చేదిశగా కేంద్రప్రభుత్వం, ఎల్‌ఐసీ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తుందని ఏజెంట్స్ యూనియన్ డివిజినల్ కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. తణుకు ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్టోబరు 1 నుంచి ఎల్‌ఐసీ మేనేజ్‌మెంట్ తీసుకువచ్చిన నూతన విధానాలు పాలసీదారులు, ఏజెంట్లకు నష్టం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యంగా ఇకపై కొత్త పాలసీలకు సంబంధించి ప్రీమియం పెంచడం, కనీస లక్ష రూపాయిల పాలసీలను రెండు లక్షలకు పెంచడం, పాలసీదారుల గరిష్ట వయస్సు 55 నుంచి 50కి కుదించడం, ఏజెంట్స్ కమిషన్‌లో కోత కోయడం దారుణమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కమిషన్‌లు పెంచాల్సిందిగా ఉద్యమాలు చేస్తుంటే ఉన్న కమిషన్‌లోంచి కోత విధించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకుండా చేసేందుకు ప్రైవేటు కంపెనీల కుట్రగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, పాలసీ ప్రీమియంలపై వేస్తున్న జీఎస్టీ తగ్గించాలని, పాలసీదారులు తీసుకుంటున్న రుణాలపై వడ్డీ శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. గత 28 రోజులుగా ఆల్ ఇండియా వ్యాప్తంగా ఎల్‌ఐసీ ఏజెంట్లు యూనియన్స్‌కు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేపట్టామని భవిష్యత్తులో సైతం యాజమాన్యం వైఖరిని బట్టి తమ తదుపరి కార్యాచరణ ఉంటుందని అన్నారు. అనంతరం సేవ్ ఎల్‌ఐసీ, సేవ్ కస్టమర్, సేవ్ ఏజెంట్ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ నాయకులు వైవీ శ్రీనివాస్, సలాది ఉదయభాస్కరరావు, సత్తి పాండురంగా రెడ్డి, టీవీకే రంగారెడ్డి, ఏజెంట్స్ పాల్గొన్నారు.



తణుకులో ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

తణుకు: మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నానుద్దేశించి ప్రతాప్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరం అన్నారు. ఎన్నో ఆశలతో కూటమికి కార్మికులు మద్దతు ఇచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని లేకపోతే భవిష్యత్తులో సమ్మెకు కూడా వెనకాడబోమని ప్రతాప్ హెచ్చరించారు. ఇంజనీరింగ్ సెక్షన్ యూనియన్ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను మాట్లాడుతూ గత అనేక ఏళ్ల నుంచి పని చేస్తున్నప్పటికీ తమకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని అన్నారు. క్లాప్ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి చెత్త సేకరణ వాహనాలు నడుపుతున్నామని తమకు నేటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి యన్.ఆదినారాయణబాబు మాట్లాడుతూ తమ సమస్యలు అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద మనసుతో ఆలోచించి పరిష్కారం చేయాలని లేకుంటే పోరాటమే శరణ్యం అన్నారు. ఈ ధర్నా అనంతరం మునిసిపల్ కమిషనర్ రామ్ కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం సీఐటీయూ జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, అర్జి కృష్ణబాబు, మందులయ్య, రాణి, అయ్యప్ప, జి.విజయకుమార్, శ్రీదేవి, పడాల దానం, నాగబాబు, తాతారావు, ఆదినారాయణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



తణుకు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు తణుకు విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలతో మహిళా కళాశాల యాజమాన్యం

తణుకు టౌన్: ఈనెల 26వ తేదీన జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో తణుకులో జరిగిన జిల్లా యువజనోత్సవాలలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినీలు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థినీలు పలు విభాగాలలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, కల్చరల్ అధ్యాపకురాలు కేవీ శ్యామలదేవి, పీ శివప్రసాద్‌లు అభినందించారు.

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి

తణుకు టౌన్: దువ్వ వయ్యేరులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద డీవీఎస్ఎస్ అశోక్‌వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, తూము దానయ్య, గూడుపు సూర్యానారాయణ, ఎలుబూడి ప్రసాద్, నరశింహమూర్తి, ధనరాజు పాల్గొన్నారు.

మీ కోసంలో ఎనిమిది దరఖాస్తులు

తాడేపల్లిగూడెం: తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు. స్థానిక పురపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మొత్తం ఎనిమిది పిర్యాదులు వచ్చాయని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మూడు, రెవెన్యూ, 01, పబ్లిక్‌హెల్త్ 02, టౌన్‌ప్లానింగ్ 02 ఫిర్యాదులు అందాయి. వాటిని తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారవేదికలో మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

తణుకు టౌన్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ దువ్వ గ్రామంలో వయ్యేరు ఏటి గట్లు పటిష్టత చేయాలని, గ్రామంలో పశువుల ఆసుపత్రిని ఆధునీకరించాలని, ప్రభుత్వ హాస్టల్ భవనాలను నిర్మించాలని కోరారు. వేల్పూరు ఎంపీటీసీ చంద్రు శ్యామల మాట్లాడుతూ వేల్పూరు, మండపాక, తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మ, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల ప్రత్యేక అధికారి హరి గోపాల్, మండల పరిషత్ పరిపాలనాధికారి వీ కృష్ణచంద్రరావులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



తణుకు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పోలీసులు

తాడేపల్లిగూడెం: ఉద్యోగ నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని డీఎస్పీ విశ్వనాథ్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పోలీసులు సమాజానికి నిరంతరం సేవలు అందిస్తుంటారన్నారు. పోలీసులకు విధి నిర్వహణలో ప్రజలు సహకరించాలన్నారు. సమాజం మనది అనే భావనలో అందరూ ముందుకు సాగాలన్నారు. పోలీసులకు, ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉంటుందన్నారు. సేవలకు పెట్టింది పేరు గూడెం ప్రాంతమని, రక్తదాన శిబిరాలు, పలు కార్యక్రమాలు సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించామన్నారు. పోలీసులు రక్తదానం చేశారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బంది, ఏరియా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

సాహితీ వేత్త కొడవగంటి జయంతి

తణుకు టౌన్: సాహిత్యంలో అనితర సాధ్యంగా రచనలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు కొడవగంటి కుటుంబరావు అని సాహితీ సామ్రాజ్య అధ్యక్షుడు తాడినాడ భాస్కరావు అన్నారు. సోమవారం తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద నిర్వహించిన కొడవగంటి కుటుంబరావు జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ జీఎం కొవ్వలి ఆంజనేయ శర్మ, న్యాయవాదులు పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, పీ శివన్నారాయణ, కోడూరి ఆంజనేయులు, బెల్లంకొండ బుచ్చిబాబు, ఆలపాటి సుబ్బారావు, సత్తి రాజారెడ్డి, పీ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీలంతా ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

ఇరగవరం: ఎస్సీలపై జరుగుతున్న దాడులు, వాటిని ఎదుర్కొనాలంటే మాలలు ఐక్యంగా ఉండాలని దళిత ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు , న్యాయవాది పొట్ల సురేష్ పిలుపునిచ్చారు. ఇరగవరం మండలం సూరంపూడి గ్రామంలో దళిత ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈసందర్భంగా సూరంపూడిలో దళిత ఐక్యవేదిక కమిటిని ఏర్పాటు చేసారు. ఇరగవరం మండల దళిత ఐక్య వేదిక కన్వీనర్ ఎన్ శ్రీనివాస్, వై బాలు, జె సుబ్బారావు, చంద్ర ప్రసాద్, అర్జున్, భీమరాజు, శ్రీనివాసరావు, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపకులాలను విడగొట్టవద్దు



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాజంలో ఉన్న ఉపకులాలని విడగొట్టి పాలకవర్గాలు తమ పబ్బం గడుపుకోవద్దని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళ్లులర్పించారు. మంగ రాజు మాట్లాడుతూ ఎస్సీలందరూ ఐక్యంగా ఉండాలన్నారు. రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, ఎస్సీ, ఎస్టీ బాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని వెల్లడించారు. రాష్ట్ర జేఏసీ కన్వీనర్ బేతాళ శరత్, నల్లి రాజేష్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగకుండా చూడాలని, ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా విజయప్రసాద్, కొండలరావు, నగేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి



వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన నిరసన చేపట్టాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి సుబ్బారావు చెప్పారు.భీమవరం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చాలీచాలని వేతనాలు, పని భారంతో వీఆర్ఏలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నైట్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీల పేరుతో అదనపు చాకిరి చేస్తున్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా నాయకుడు ఖాదర్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంటుగా తాతారావు

తాడేపల్లిగూడెం: ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంటుగా ఆర్ఎంఓ ఆర్‌వీఎస్.తాతారావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఆసుపత్రిలో గర్భిణికి వైద్యసాయం విషయంలో విమర్శలు వచ్చిన నేపథ్యంలో సూపరింటెండెంటుగా, డీసీహెచ్‌గా ఉన్న డాక్టర్ పి.సూర్యనారాయణ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఆసుపత్రిలో ఆర్ఎంఓగా ఇటీవల వచ్చిన డాక్టర్ తాతారావు సూపరింటెండెంటుగా బాధ్యతలు తీసుకున్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసును తాతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి సేవల్లో లోపాలు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు.

వ్యక్తిని కొట్టిన ఘటనపై కేసు నమోదు

అత్తిలి: వరిఘేడు శివారు ఎర్రనీలిగుంట గ్రామంలో కొబ్బరికాయల దింపు కార్మికుడు కడలినాగశ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన పెచ్చెట్టి దేవ కృష్ణ మోహన్‌ను కొట్టాడనే ఆరోపణపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు సోమవారం తెలిపారు. రెండు రోజుల క్రితం పెచ్చెట్టి దేవకృష్ణ మోహన్ ఇంటికి కడలి నాగ శ్రీనివాస్ కొబ్బరికాయలు దించడానికి వెళ్లాడు. కృష్ణ మోహన్ రూ. 200లు బకాయిపడగా డబ్బులు అడగడానికి వెళ్లిన నాగ శ్రీనివాస్ గొడవపడి కృష్ణమోహన్‌ను కొట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈసంఘటనలో నాగ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కృష్ణపరమాత్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అశ్వయుజ బహుళ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కృష్ణ పరమాత్మకు విశేష పూజలు జరిగాయి. స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలతో విశేష అలంకరణ గావించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

డీఆర్, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కరీం

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఆర్, పీఆర్‌సీ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కరీం కోరారు. అసోసియేట్ అధ్యక్షుడు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం తాడేపల్లిగూడెం యూనిట్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అడిషనల్ కోంటమ్ పెన్షన్ పునర్దురించాలని, కొత్త పీఆర్‌సీ కమిటీ నియమించాలని, ఈ లోపుగా 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.హరికుమార్, గౌరవాధ్యక్షులు కాయల నాగేశ్వరరావు, వీకే వీరారావు, అర్జునరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



జేఎన్‌టీయు జట్టుకు ఎంపికైన శశి విద్యార్థిని యశస్వినిని అభినందిస్తున్న వైస్‌చైర్మన్

తాడేపల్లిగూడెం: జేఎన్‌టీయు విశ్వవిద్యాలయం నెట్‌బాల్‌టీంకు శశి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని యు.యశస్విని ఎంపికై నట్టు యాజమాన్యం సోమవారం తెలిపింది. నవంబరులో జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జరుగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. యశస్విని శశి కళాశాలలో ఐటీ రెండో సంవత్సరం చదువుతోంది. విద్యార్థినిని కళాశాల చైర్మన్ , వైస్‌చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ, మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, డీన్ సుబ్రహ్మణ్యం, పీడీ శేఖర్, సత్యనారాయణ, కెకె అభినందనలు తెలిపారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 10 మంది ఎంపిక



క్యాంపస్ డ్రైవ్ శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో సోమవారం క్యాంపస్ డ్రైవ్ (జాబ్ మేళా) జరిగింది. అరబిందో ఫార్మ, ముత్తూట్ ఫైనాన్స్, స్టాఫింగ్ టైటాన్స్, బిగ్ బాస్కెట్, ఎల్‌టీ, డీమార్ట్, యారేకాపోర్స్, స్విగ్గీ కంపెనీలు హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. ఇంటర్వ్యూలకు 56 మంది డిగ్రీ, బీఫార్మసీ, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు. స్టాఫింగ్ టైటాన్స్, అరబిందో ఫార్మా వారు 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎన్వీ రమణరావు, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చక్కా ఉమ, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రజని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

తణుకు టౌన్: వ్యవసాయ శాఖలో పనిచేసే సిబ్బంది ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివిధ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్ చెప్పారు. సోమవారం తణుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించి అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత గురించి, పురుగు మందులకు బదులుగా జీవన ఎరువులను ఏవిధంగా వాడాలో వివరించారు. ఈ సందర్భంగా సిబ్బందిని క్షేత్ర స్థాయికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో డీపీఎం నూకరాజు, ఏవో కె కుసుమ, సిబ్బంది పాల్గొన్నారు.